

# హైదరాబాద్ వార్త

## నేడు 'వంశీ-శుభోదయం ఉగాది పురస్కారాలు'

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వంశీ ఆర్ట్ థియేటర్స్, ఇంటర్నేషనల్, వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'వంశీ-శుభోదయం ఉగాది పురస్కారాలు' ప్రదానోత్సవ కార్యక్రమాన్ని 23న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు వివరించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై పురస్కారాలను అందిస్తారని, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, కిమ్స్ హాస్పిటల్ అధినేత బొల్లినేని కృష్ణయ్య, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎం బండారు సుబ్బారావు, ప్రముఖ సినీదర్శకులు రేలంగి నర్సింహారావు, తిరుమల బ్యాంక్ సిఎండి నంగునూరి చంద్రశేఖర్, శుభోదయం గ్రూప్ సిఎం డాక్టర్ శ్రీలక్ష్మిప్రసాద్ కలపటపు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీరామరాజు ఆధ్వర్యంలో వీణావాదన, తరంగిణి రామరాజు ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత కచేరి, మైలవరపు శ్రీనివాసరావుచే పంచాంగశ్రవణం ఉంటుందన్నారు. వేద ఉగాది పురస్కారాన్ని డాక్టర్ మైలవరపు శ్రీనివాస్‌రావు, డాక్టర్ మైలవరపు సుబ్బలక్ష్మిలకు అందిస్తామని, యండమూరి వీరేంద్రనాథ్ స్వర్ణపథకాలను ఊహ, ఉమామహేష్ ఆచాళ్ళ, నాగేంద్ర కాశీలకు అందిస్తారన్నారు.

### శాస్త్రీయ కర్ణాటక సంగీత కచేరి

మానసిక, వ్యక్తిత్వవికాసానికి సహజయోగ ఎంతో ఉపకరిస్తుందని వక్తలు పేర్కొన్నారు. సహజయోగట్రస్ట్(మేడిపల్లి) ఆధ్వర్యంలో మాతాజీ నిర్మలాదేవి శతజయంతి సందర్భంగా తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, అనిందబోస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మహతి ఆర్ట్స్(విజయనగర్ కాలనీ) ఆధ్వర్యంలో వింజమూరి లక్ష్మి శిష్యబృందం ఆధ్వర్యంలో శాస్త్రీయకర్ణాటక సంగీత కచేరి జరిగిందది.



నిరుద్యోగుల్లో నిరుత్సాహం

ఆర్థిక భారంతో కోచింగ్ సెంటర్లకు పరుగులు

గ్రూప్1 ప్రిలిమినరీ క్వాలిఫై కానివారిలో ఆశలు

కోచింగ్ తీసుకునేందుకు పట్నం బాట పట్టిన అభ్యర్థులు

గ్రూప్ 2,4 అభ్యర్థులతో కళకళలాడుతున్న కోచింగ్ సెంటర్లు

అడ్డుగోలు ఫీజులు వసూలు చేస్తున్న నిర్వాహకులు

# ఫీజుల గుంజుడు

**ఒక్కో అభ్యర్థి నుంచి కోచింగ్ ఫీజు కింద రూ.30వేల నుంచి రూ.35వేలు, హాస్టల్ ఫీజునెలకు రూ.6వేలు వసూలు చేస్తున్నారు. ఈ విధంగా ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేద విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రూప్ పరీక్షలకు సంబంధించి ఫీజును కూడా 20 నుంచి 40 శాతం పెంచేశారు కూడా. అశోక్‌నగర్‌లోని ఓ కోచింగ్ కేంద్రంలో సివిల్స్ కోచింగ్‌కు రూ.1.80లక్షలు తీసుకుంటుండగా, గ్రూప్-1 మెయిన్స్‌కు రూ.50వేల నుంచి రూ.55వేలు వసూలు చేస్తున్నారు. గ్రూప్-2 రెండు నెలల శిక్షణకు రూ.33వేలు వసూలు చేస్తున్నారు. అదనంగా ఫీజుతో పాటు జీఎస్టీని కూడా వసూలు చేస్తుండడం గమనార్హం.**



హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: నల్గొండకు చెందిన సురేష్ అశోక్‌నగర్‌లోని ఓకోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకుని ఇటీవల జరిగిన గ్రూప్1 ప్రిలిమినరీలో క్వాలిఫై అయ్యాడు. అతడు మెయిన్స్‌కు చదువుతున్న క్రమంలో గ్రూప్1 పరీక్షలు రద్దు కావడంతో మళ్లీ ప్రిలిమినరీకి ప్రిపేర్ అవుతున్నాడు. అయితే మళ్లీ కాలిఫై అవుతానో లేదోనని ఆందోళనలో ఒత్తిడికి గువుతున్నాడు. అలాగే వనస్థలిపురానికి చెందిన చంద్రశేఖర్ గతంలో కోచింగ్ తీసుకుని ఇంటిదగ్గరే ఉంటూ గ్రూప్1 ప్రిపేర్ అవుతున్నాడు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షలో క్వాలిఫై కాకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగంలో ఈమధ్యే చేరాడు. పరీక్షలు రద్దు కావడం.. మళ్లీ ఎగ్జామ్స్ నిర్వాహణ ఉండటంతో ఉద్యోగం మానేసి మళ్లీ చదవాలా.. లేక ప్రైవేట్ ఉద్యోగమే చేసుకోవాలా అన్న అయోమయంలో ఉన్నాడు. ఇటీవల గ్రూప్1 రద్దు కావడంలో నిరుద్యోగులు మళ్లీ ప్రిలిమినరీకి అవుతున్నారు. క్వాలిఫై కానివారు మళ్ళీ అశోక్‌నగర్ బాటపట్టడంతో కోచింగ్ సెంటర్లు మళ్లీ కళకళ లాడుతున్నాయి. దీంతో నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని కోచింగ్ కేంద్రాలు అడ్డగోలు ఫీజులు వసూలు చేస్తున్నాయి. అలాగే గ్రూప్ 2,4 పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థుల కోసం వివిధ సబ్జెక్టుల్లో గుర్తింపు కలిగిన నిపుణులతో కోచింగ్ నిర్వ హిస్తామంటూ కొంతమంది బూటకపు ప్రకటనలతో నిరుద్యోగులను బురిడీ కొట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాయి ఒక్కో బ్యాచ్‌లో కనీసం 500 మంది వరకు తగ్గకుండా రోజుకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున శిక్షణ నిర్వహిస్తున్నాయి. కొన్ని చోట్ల మరికొన్ని ఆడిటోరియంలు, అపార్ట్‌మెంట్‌లను అద్దెకు తీసు కుని మరీ కోచింగ్ ఇస్తున్నారు. మరి కొన్ని చోట్ల ఏకంగా ఫంక్షన్ హాళ్ళను కూడా బుకింగ్ చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కోచింగ్ కేంద్రాల నిర్వహణకు అడ్డాగా ఉన్న అశోక్ నగర్‌లో ప్రస్తుతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ప్రాంతంతో పాటు దిల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, కూకట్‌పల్లి తదితర ప్రాంతాలలో 1200 వరకు కోచింగ్ కేంద్రాలుండగా ప్రస్తుతం ఇందులో దాదాపు లక్షకుపైగా నిరుద్యోగ యువతీ, యువకులు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నారు.

ఒకవైపు మోయలేని భారంగా ఉన్న ఫీజు, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఉండడంతో సతమతమ వుతున్నారు. ఫలితంగా చాలామంది నిరుద్యోగులు అప్పులుచేసి మరీ చదువుకుంటున్నారు. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ కోచింగ్ కేంద్రాలలో అధిక ఫీజులను నియంత్రించాలని విద్యార్థి సంఘాల నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వంపై వత్తిడి కూడా తీసుకువచ్చారు. ఉద్యోగ నోటిఫికేషన్ల కాలం కావడంతో నిరుద్యోగ యువతకు కేంద్రాలు అడిగినంత డబ్బును అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకోవడానికి మొగ్గుచూపుతు న్నారు. ఎలాగైన తమ కుటుంబ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా యువత కోచింగ్ తీసుకుని విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. మరోవైపు గ్రూప్-2, గ్రూప్-4, గ్రూప్-3 పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఉద్యోగాలు సాధించాలనే ఆశతో కోచింగ్ కేంద్రాలపైనే ఆశలు పెట్టుకున్నారు.

శోభకృత్ నామ సంవత్సరంలో

# అన్నీ శుభాలే

అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో రాజకీయాల్లో మార్పులు

కరోనాకు భయపడవలసిన అవసరం లేదు

పంచాంగ కర్త బాచంపల్లి సంతోష్‌కుమార్‌శర్మ



సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: శోభకృత్ నామ ఉగాది సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ప్రముఖ వేద పండితులు, పంచాంగ కర్త బాచంపల్లి సంతోష్‌కుమార్‌శర్మ స్పష్టం చేశారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అన్ని ప్రాజెక్టులు, చెరువులు నీటితో నిండుతాయని పంటలు బాగా పండుతాయని, రైతులకు మంచి లాభాలు చేకూరుతాయని తెలిపారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడ ఎండలు మండిపోతాయని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపైన ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌శర్మచే పంచాగ పఠనం జరిగింది. శర్మ మాట్లాడుతూ శోభకృత్ నామ సంవత్సరంలో శుభాలు కలుగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలోసుస్థిరమైన పాలన కొనసాగుతుందని ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతుందని, అన్ని పెండింగ్ బిల్లులు పాస్ అవుతాయని, అయితే కొంత మంది వ్యకుల నుంచి వ్యతిరేకత వస్తుందని హెచ్చరించారు. రాజు సమర్థుడు కావడం వల్ల అలాంటివేవి పారవని చెప్పారు. విద్య, వైద్య రంగాలలో పరిశోధనలు జరుగుతాయని, విద్యార్థులు ఆ రెండు రంగాలలో అభివృద్దిని సాధిస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు చేయవలసి వస్తుందని, అయినప్పటికి మనదేశం ఆర్థికంగా బలపడుతుందని, ప్రపంచదేశాలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ లోక కళ్యాణం కోసం యజ్ఞాలు, యాగాలు చేయవలసివస్తుందన్నారు. దేవాలయాలన్ని అభివృద్ది చెందుతాయన్నారు. రాష్ట్రంలో కరోనా లాంటి వైరస్ ప్రభావం ఉండదని, మాస్కులు ధరించాల్సిన అవసరం ఉండదన్నారు.

అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో రాజకీయాల్లో మార్పులు జరుగుతాయని, అనుహ్యపరిణామాలు వేగంగా జరుగుతాయని, ఒడిదుడుకులు ఉంటాయని, ఘర్షణలు జరుగుతాయని, అయితే పోలీసులు చాకచక్యంతో అణిచివేస్తారని చెప్పారు. స్త్రీల అధిపత్యం అన్ని రంగాలలో పెరుగుతుందని, పబ్‌ల కల్చర్, కళావేదికలకు డిమాండ్ ఉంటుందని, మీడియాకు కావలిసినంత సమాచారం వెతుక్కోకుండానే లభిస్తుందన్నారు. ఏప్రిల్ 22వ తేదీ నుంచి 24 వరకు గంగానదీ పుష్కరాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సిహెచ్ మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి, రాష్ట్ర డిజిపి అంజనీకుమార్, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎమ్మెల్సీలు, ఛైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ స్వాగతం పలికారు.

# నగర వ్యాప్తంగా శోభకృత్ ఉగాది సంబురాలు

### పంచాగ శ్రావణాలతో కాలనీలు, బస్తీలల్లో ఆధ్యాత్మిక శోభ

హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: కొత్త సంవత్సరాన్ని 'శోభకృత్' నామసంవత్సరం తెలుగు సంవత్సరాది ఉగాదిని నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు పచ్చి మామిడి, చింతపండు, వేపపూలు, బెల్లం, ఉప్పు, ఎండు మిరియాల పొడితో చేసిన సాంప్రదాయ ఉగాది పచ్చడిని సేవించారు. ఇది జీవితం అన్ని భావోద్వేగాల మిశ్రమం అని సూచిస్తుంది. రాష్ట్రప్రభుత్వం అధికారికంగా పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో నిర్వహించగా శారదపీఠం పండితులు బాచంపల్లి సంతోష్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్, రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వి.శ్రీనివాస్, మహమూద్ ఆలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, సంస్కృతసారధి రసమయి బాలకిషన్, రాష్ట్ర నీటిపారుదల కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, నగర పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా ప్రముఖ దేవాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలలో పారాయణాలు, పంచాంగశ్రవణాలను నిర్వహించారు. హిందూ గృహాలన్నీ పువ్వులు, మామిడి, వేప ఆకులతో రుచికరమైన ఆలంకరణ తీపి-చేదు ఉగాది పచ్చడితో సహా ప్రత్యేక ఉగాది వంటకాలు చేశారు. జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం, చిక్కడపల్లి శ్రీవారి ఆలయం, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్, కీసరగుట్టలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం, నాచారంగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మణికొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయాలను దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### గండిపేట్ మండలంలో ఘనంగా జరిగిన "ఉగాది" పర్వదినం

**నార్సింగి..** గండిపేట్ మండలంలో హిందువులు అత్యంత భక్తి,శ్రద్దల మధ్య జరుపుకునే "ఉగాది" పర్వదినం ఘనంగా జరిగింది. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధుల్లోని అన్ని దేవాలయాల వద్ద వేద పండితులతో "పంచాంగం" చెప్పించారు. వందలాది మంది ప్రజలు భక్తి,శ్రద్దల మధ్య ఆలయాలకు వెళ్లి పండితులు చెప్పిన పంచాంగంను శ్రద్దగా విని ఆనంద పడ్డారు. హిందువుల కొత్త సంవత్సరం కావడం వలన బుధవారం తెల్లవారు ఝామున ఐదు గంటల నుంచే ఆలయాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తజనం ఆలయాలకు రావడంతో కిటకిటలాడాయి. ముఖ్యంగా గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ, ఊరడమ్మ, ఈదమ్మ ఆలయాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున వెళ్లి తమ మొక్కులు సమర్పించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం తరువాత షడ్ రుచులతో కూడిన పచ్చడిని భక్తజనం అందరికి పంపిణీ చేశారు. మొత్తంమ్మీద ఉగాది ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

## ఇందిరాపార్కు అభివృద్ధికి చర్యలు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఉగాది వేడుకలలో ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, మార్చి 22, ప్రభాతవార్త: రాజకీయాలకు అతీతంగా ఇందిరాపార్కు అభివృద్ధికి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఇందిరా పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్ఎంసీ డిప్యూటి మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, స్థానిక కార్పోరేటర్ రచనశ్రీతో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని, రైతన్నలకు మేలు జరగాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఇందిరాపార్కును అత్యంత సుందరీకణతో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ఇందిరాపార్కును రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పార్కుగా తీర్చి దిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేందర్‌రెడ్డి, నాయకులు టికేఎం రెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రభాకర్‌యాదవ్, గాజుల శంకర్, నరేందర్, శ్రీనివాస్‌ముదిరాజ్, వంగాల రాజ్‌గౌడ్, ఇందిరాపార్కు డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళకుమార్, రంగరాజ్‌గౌడ్, ఈ.వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు మహేందర్‌బాబు, బీఆర్ఎస్ అధ్యక్షులు వల్లాల శ్యాం యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్‌గౌడ్, రాజేష్, ఆర్.రాంచందర్, వాకర్స్ పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### నేడు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో మంత్రి పర్యటన

శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త : శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి గురువారం మధ్యాహ్నం పర్యటించనున్నారు. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం హాల్‌లో మధ్యాహ్నం 1గంటకు మండల స్థాయిలో నేషనల్ పంచాయతీ అవార్డుల ప్రధాన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొననున్నారు. అదే విధంగ ఆ తరువాత శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2గంటలకు మండల స్థాయిలో నేషనల్ పంచాయతీ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొంటున్నట్లు ఆయా మండలాల ఎంపిపిలు డి.ఎల్లుబాయిబాబు, వి.హారికమురళీగౌడ్‌లు పేర్కొన్నారు. మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, సంబంధిత మండల,గ్రామాల అధికారులు పాల్గొననున్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని గోపిగడ్డ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గోపిగడ్డ గ్రామానికి చెందిన జొన్నాడ ఆంజనేయులుగౌడ్(47) తన వ్యవసాయ పొలం వద్దకు బుధవారం ఉదయం నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. పొలం వద్ద ఎల్‌టీ లైన్ విద్యుత్‌వైర్ తెగిపడి అతని మీద పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పండుగ పూట గ్రామంలో విషాదచాయాలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న విద్యుత్ ఏఈ నరేందర్ పరిశీలించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు.

### దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలి

మేడ్చల్, మార్చి 22. ప్రభాతవార్త : దొంగతనాలు జరుగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, విలువైన వస్తువులు సురక్షితంగా భద్రపర్చుకోవాలని మేడ్చల్ ఎస్ఐ మురళీధర్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో గల శ్రీ కాలనీలో ప్రజలతో ప్రజలతో మేడ్చల్ పోలీసులు సమావేశం నిర్వహించారు.

టిటిడి శ్రీవారి దేవాయలంలో ఘనంగా

## తిరుమంజనం, ఆస్థానం

సైఫాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శోభకృత్ నామ సంవత్సరం ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీవారికి తిరుమంజనం, అస్థానం కార్యక్రమాలు కన్నుల పండవగా, వేడుకగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. ఉగాది వేడుకలను పురస్కరించుకుని టిటిడి దేవాలయానికి రంగులు వేయించడం జరిగింది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించింది. భక్తులు నూతన వస్త్రాలను ధరించి భక్తి శ్రద్దలతో పాల్గొన్నారు. సాయంత్రం గోపికృష్ణశర్మచే పంచాంగ శ్రవణం జరిగింది. శక్తులు అసక్తితో పంచాంగ శ్రవణాన్ని అలకించారు. పూజారులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఎఇఓ జగన్‌మోహన్‌చారి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

టిఎస్‌పిఎస్‌సి కార్యాలయం వద్ద

## కలకలం రేపిన పోస్టర్లు, ఫ్లెక్సీలు

గోషామహల్,మార్చి 22ప్రభాతవార్త: టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ వ్యవహారం తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే.దీనికి తోడు ఈ ఘటనపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.టిపిఎస్‌సిఎస్ భాద్యత యుతంగా వ్యవహరించకుండా జిరాక్స్ సెంటర్‌గా వ్యవహరించిందని ఏకంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కార్యాలయం గోడకు పోస్టర్లు అంటించారు.నాంపల్లిలోని పబ్లిక్ సర్వీస్ కార్యాలయం వివాదస్పద వాల్ పోస్టర్లు పెట్టి,టిఎస్‌పిఎస్‌సి జిరాక్స్ సెంటర్ అంటూ గోడపోస్టర్లు,ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ అన్ని రకముల ప్రభుత్వ ఉద్యోగ, ప్రవేశ పత్రములు లభిస్తాయన్నారు.బుధవారం పలు డిమాండ్లతో ఓయూ జెఏసీ సభ్యులు పోస్టర్లు, అతికించారు. ఇది ఉద్యోగ నియాకమ కార్యాలయం కాదు.జిరాక్స్ సెంటర్ అని వాల్‌పోస్టర్లతో వెల్లడించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తక్షణమే తెలంగాణ విద్యార్దులకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని, ప్రశ్నపత్రాల లీకేజీలో ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబ సభ్యులు పాత్రలేదని,వెంటనే ఈకేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.ఈ నెల నుంచి10వేల రూపాయల చొప్పున తిరిగి పరీక్షలు నిర్వహించే వరకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని పోస్టర్ డిమాండ్‌లో పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న బేగంబజార్ పోలీసులు అక్కడి నుంచి పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగింప చేశారు.

### షాబాద్ మండలంలో ఘనంగా ఉగాది సంబురాలు

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : శోభకృత్‌నామ సంవత్సరం రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంటలకు అణుగుణంగా ఉంటుందని పంచాంగ శ్రవణ పండితులు తెలిపారు. బుధవారం మండలంలోని షాబాద్, నాగర్‌గూడ, నాగర్‌కుంట, మల్లారెడ్డిగూడ, కుమ్మరిగూడ, తిర్మలాపూర్, తాళ్లపల్లి, బొబ్బిలిగామ, సర్దార్‌నగర్, హైతాబాద్ తదితర గ్రామాల్లో పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

# పెట్టుబడి పేరుతో టోకరా

తక్కువ పెట్టుబడి.. రెండింతల లాభం

రోజుకు వేలల్లో సంపాదించొచ్చు అంటూ బురిడీ

అమాయకుల నుంచి లక్షల్లో దండుకుంటున్న కేటుగాళ్లు

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: ఫలానా కంపెనీలో పెట్టుబడులు పెడితే రెట్టింపు ఇస్తాం. ఫలానా షేర్లుకొంటే పదిరెట్ల లాభం వంటి ఆకర్షణీయ ప్రకటనలు చూసి మోసపోవద్దు. ఈజీ మనీకి అర్రులు చాచవద్దు. ఏదేని సంస్థలో పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు లేదా షేర్లు కొనుగోలులో క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఆకంపనీనిజంగా ఉందా.సదరు ప్రకటన ఎవరిచ్చారు. షేర్ మార్కెట్‌లో పెట్టబడులు రిస్క్‌తో కూడుకున్నవి కావున ఎవరూ మీకు ఊరిక లాభాలు ఇవ్వరని గ్రహించాలి. ప్రముఖ కంపెనీలలో ఫ్రాంఛైజీలలో పెట్టుబడులని ఫోన్‌లు చేసి ఊరించి ముందుగా తమ ఖాతాలలో అందినంత డబ్బులు వేసుకుంటారు.ఆతర్వాత ఫోన్ ఆతర్వాత ఫోన్ చేసినా సమాధానం కరువవుతుంది. సెల్ టవర్ల ఏర్పాటు తక్కువ వడ్డీలోన్‌లు ఇప్పించడం, ప్రభుత్వ ఉద్యోగాలంటూ ఇలా దొరికిపోతే..అలా మోసాలు చేస్తారు. మోసగాళ్లు ఫోన్, ఎస్ఎంస్ లేదా ఈమెయిల్ ద్వారా ముందుగా బాధితుడిని అప్రోచ్ అవుతారు. వెంటనే వారి ఎత్తును పసిగడితే మోసపోకుండా ఉండవచ్చు.

**30లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..** నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులను నుంచి సైబర్ నేరగాళ్లు భారీమొత్తంలో డబ్బులు కాజేశారు. సైబర్‌క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఎస్సార్‌నగర్‌కు చెందిన శివ అనేయువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మళ్లాడు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన ఓవ్యక్తి చెప్పిన విధంగా వెగాస్11 బెట్టింగ్ అనే యాప్‌లో ఏడాదిన్నరగా బెట్టింగ్ చేస్తున్నాడు. బెట్టింగ్ నుంచి ఇన్వెస్టమెంట్ వైపు మళ్లించి అతడి నుంచి రూ.30లక్షలు కాజేశారు. అలాగే మలక్‌పేట్‌కు చెందిన యువతి స్టడీ టేబుల్ అమ్మేందుకు ఓఎల్ఎక్స్‌లో యాడ్ పోస్టు చేసింది. దీనిని చూసిన నేరగాడు స్టడీ టేబుల్ కొంటానని నమ్మించి క్యూఆర్ కోడ్‌లు పంపి పలు దఫాలుగా రూ.14లక్షలు స్వాహా చేశాడు. ఇలా ఇద్దరినుంచి సైబర్ నేరగాళ్లు మొత్తం రూ.44లలక్షలు కాజేశారు.

**లాటరీ గెలిచారంటే నమ్మొద్దు..** ఫోన్ చేసి మీకు ఫలానా లాటరీలో కోట్లు వచ్చి పడ్డాయి. ప్రాసెసిం గ్ ఫీ,కస్టమ్ తదితర వాటికి కొంత డబ్బు పంపించాలని చెబితే..ఖచ్చితంగా మోసం అని గుర్తించండి. వారు దశలవారిగా మీ నుంచి డబ్బును వసూలు చేస్తారు. ముందుగా మీదేశంలో లాటరీ టికెట్‌లు కొనే అనుమతి ఉందా. అసలు లాటరీ టికెట్ మీరు కొన్నారా లేదా అని నిర్ధారించుకోండి. మీరు అసలు టికెట్ కొన్నా ఎవరు మీకు గిఫ్ట్ ఎవరు ఇవ్వరని గుర్తుంచుకోండి. అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీబ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచార వంటి విషయాలను అడిగినప్పుడు ముందుగా అడిగేవారి రెసిడెన్సియల్స్, పూర్వాపరాలు చూడండి. అసలు మీకుఎవరు.? ఎందుకు ఫోన్ చేశారు ?. నాఫోన్ నంబర్ మీకు ఎవరిచ్చారు అని ప్రశ్నలు అడగండి వారిచ్చిన సమాధానాలు సంతృప్తిగా లేకున్నా. వారితడబడ్డా వారికాల్ డిస్కనెక్ట్ చేయడం మంచింది.

## సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

కొడంగల్, మార్చి 22 ప్రభాతవార్త : సేవా భావంతో ఏర్పాటు చేసిన సత్యసాయి సేవా సమితి అద్వర్యంలో కొడంగల్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంబించిన ఆర్టీసీ డిపో మేనేజర్ సమత,డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్‌లు మాట్లాడుతు వేసవి కాలంలో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని అన్నారు.సేవా కార్య క్రమాలతో ముందుకు వెళ్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు చలివేంద్రాన్ని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేయడం హార్షించదగ్గ విషయమన్నారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ పీఎన్ రెడ్డి, రఘుపతిగౌడ్‌ల సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఉగాది పర్వదినానికి దేవాలయాల కిటకిట

ఖైరతాబాద్, మార్చి 22 ప్రభాతవార్త: బస్తీల, కాలనీలలో సమీపంలో ఉన్నటువంటి దేవాలయాలు కుటుంబసమేతంగా కిటకిటలాడాయి. ఉగాది పర్వదినం రోజైన బుధవారం ఉదయాన్నే ప్రతి కుటుంబంలో ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో మహిళలు తీపి వంటకాలు, ఉగాది పచ్చడి వంటి వాటితో ప్రతి ఇంటా యమ బిజీగా ఉండడం తమకు పండుగ రోజున షరామామూలే అన్నట్లు కొందరు మహిళలు సూచిస్తున్నారు. ప్రతి కుటుంబం ఇలా సుభిక్షంగా, సంతోషంగా పది కాలాల పాటు చల్లంగా ఉండాలని ఆ భగవంతులను ప్రార్థించుకున్నట్లు కొందరు చెబుతున్నారు. కొత్త పంచాంగం కోసం అక్కడి పురోహితుల్ని, మరికొందరు పండితులను అడిగి తెలుసుకున్నారు. ఉగాది పండుగ రోజైనందున స్థానికంగా మార్కెట్లు కూడా కిటకిటలాడాయి. ధరలు ఎంతున్నా పండుగకు సర్వసాధారణమేనంటున్నారు ఇంకొందరు.

## శోభకృత్ నామసంవత్సరం అందరిలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి: ఎమ్మెల్యే ముఠాగోపాల్



పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: శోభకృత్ నామసంవత్సరం అందరిలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువనేత ముఠాజైసింహ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం, ఆలయం అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, జి.పురుషోత్తమచారి, ఎస్‌బివిఎన్.ఆచార్యులు, భక్తులు, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, శ్రీధర్‌రెడ్డి, శివాలయం చైర్మన్ శ్రీధర్‌చారి, శంకర్‌మూదిరాజ్, బల్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నేత వి.శ్రీనివాస్‌రెడ్డి ఉగాది పండుగ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సంవత్సరం అందరు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుణ్ని వేడుకున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్ విఎస్ఆర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు డి.మోహన్, సిరిగిరి కిరణ్, కార్తీక్‌యాదవ్, అజ్జు, సాయియాదవ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమికి శ్రీవారి ఆలయం సిద్ధం

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి వారి కళ్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలయం వ్యవస్థాపక వంశీయుడు స్వర్గీయ జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఆలయం సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు వివరించారు. 30న ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమం ప్రారంభమవుతుందని, అనంతరం బిందెతీర్థము, బాలభోగము అనంతరం సీతారామ చంద్రస్వామివారికి పంచామృతాభిషేకం, ఎదురుకోళ్ళు, కళ్యాణం ఉంటుందన్నారు. అనంతరం ఆరగింపు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, ఊరేగింపు ఉంటుందన్నారు.

## ఉగాది జాతీయ పురస్కారాలు, కవిసమ్మేళనం



ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియాను సత్కరిస్తున్న విశ్రాంత ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: ఎస్జీవోస్ నెట్‌వర్క్ సౌజన్యంతో విశ్వశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఉగాది జాతీయ పురస్కారాలు, కవిసమ్మేళనం కార్యక్రమంలో సుప్రసిద్ధ కవి, సినీగేయరచయిత, కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప హాజరై ఈ పురస్కారాలను అందించిగౌరవించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియా, శతచినరత నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, విశ్రాంత ఉమ్మడి రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మైన్స్, ప్రముఖ కవి వి.డి.రాజగోపాల్, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ అధినేత మేడిది వెంకటేశ్వరరావు, సుప్రసిద్ధ సాహితీవేత్త ప్రొఫెసర్ దేవన్న, సుప్రసిద్ధ గజల్ కవయిత్రి, భాషా పరిశోధకురాలు రాజావాసిరెడ్డి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైకోర్టు న్యాయవాది, కవయిత్రతి తాటికొండ కళా నిర్వహణలో కవిసమ్మేళనం జరిగింది.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి



బోయిన్‌పల్లి బిఆర్ఎస్ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పూజలు చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, ముప్పిడి మధుకర్

కంటోన్మెంట్,మార్చి 22 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని భగవంతున్ని వేడుకున్నట్లు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బోయిన్‌పల్లిలోని బిఆర్ఎస్ పార్లమెంట్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి,పోలేలను అందజేశారు. వేద మంత్రాలతో పూజలు నిర్వహించి బిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, నళిని కిరణ్, ప్రభాకర్, బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్,పెద్దాల నరి ్సంహ, ప్రవీణ్ యాదవ్,పిట్ల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పిడి మధుకర్ కార్యకర్తలకు, నాయకులకు శాలువకప్పి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## అనాధలు, నిరాశ్రయులతో కలసి ఉగాది వేడుకలు

### స్కైఫౌండేషన్ అధ్యక్షులు వై.సంజీవకుమార్



స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

ధర్నాచౌక్, మార్చి 22, ప్రభాతవార్త: అనాధలు, నిరాశ్రయులతో కలసి స్కైఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించుకున్నామని స్కైఫౌండేషన్ అధ్యక్షులు వై.సంజీవకుమార్ తెలిపారు. బుధవారం ఉగాది సందర్భంగా అందరూ కుటుంబాలతో పండుగ జరుపుకుంటారని, కానీ ఎవరూ లేని నిరాశ్రయులైన అనాధలు, అభాగ్యులకు ఆ అవకాశం లేదు కాబట్టి స్కైఫౌండేషన్ వారితో కలసి పండుగ జరుపుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి, భక్ష్యాలు, ఆహారం, పండ్లు, మంచినీరు వారికి అందించారు. ఈ కార్యక్రమంలో స్కైఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ఓ.పావని, సభ్యులు వర్షిత, శిరీష, శ్రీవర్షితారెడ్డి, స్వప్నిల్, రంజిత్, హరీష్‌కుమార్, అఖిల్, కరుణాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : నివేదిత



కంటోన్మెంట్‌లో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న నివేదిత తదితరులు

అడ్డగుట్ట, మార్చి 22 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత సాయన్న కూతుర్లు నివేదిత, లాస్య నందితలు తెలిపారు. 7వ వార్డు లాల్‌బజార్‌కు చెందిన ఆంథోనీ నోయల్, నిర్మలబాయ్‌లకు మెరుగైన వైద్యం కోసం మంజూరైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం నివేదిత, లాస్య నందితల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకురాలు నాగినేని సరిత, నాయకులు మురళీ యాదవ్, నత్యానంద్, నీరజ్, వినోద్, ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిని ఆక్రమించి కిరాయికి ఇచ్చిన విషయంలో గొట్టిముక్కల పద్మారావుపై కేసు నమోదు

మూసాపేట, మార్చి 22, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలోని ప్రముఖ రాజకీయ నాయకుడైన గొట్టిముక్కల పద్మారావుపై అక్రమంగా ఇంటిని ఆక్రమించి ఇతరులకు కిరాయికి ఇచ్చిన విషయంలో కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. కూకట్‌పల్లి పోలీసులు నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్ ప్రకారం మంగళవారం పద్మారావు తమ్ముడైన గొట్టిముక్కల పాండు రంగారావు దగ్గర సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న బాలేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం తన యజమానులకు తెలవకుండా వివేకానందనగర్‌లోని అనుపమ హాస్పిటల్ వెనుక గల తీక్ష రెసిడెన్సీలో ఫ్లాట్ నెం. 40లో గల 3 ఫ్లాట్స్ 102, 403, 502 గల ఫ్లాట్స్‌లో 2 ఫ్లాట్స్ ఇతరులకు కిరాయికి ఇచ్చినట్లు ఇంకో ఫ్లాట్‌లో ఇంటీరియల్ డిజైన్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పనులన్నీ గొట్టిముక్కల పద్మారావుతో పాటు అతని అనుచరులు ఒకరు శంకర్ కాగా మరొక వ్యక్తి గతంలో ఒక ప్రముఖ వ్యక్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న రౌడీషీటర్ సుదర్శన్ అని తన ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. వీళ్ళు ఇద్దరు గతంలో గొట్టిముక్కల పద్మారావు అండతో గత నెల ఫిబ్రవరి 19వ తేదీనాడు ఫ్లాట్ల పరిస్థితి చూద్దామని వెళ్ళినప్పుడు నన్ను ఈ అపార్ట్‌మెంట్ పరిసరాలకు రావద్దని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. మాకు ఏదైనా హాని జరిగితే వీళ్ళే బాధ్యత వహించాలని కూకట్‌పల్లి పోలీసులను కోరడం జరిగింది. ఈ విషయంలో ఫిర్యాదు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు గొట్టిముక్కల పద్మారావు, శంకర్, సుదర్శన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## దాడి కేసులో ముగ్గురికి సంవత్సరం జైలు శిక్ష

చార్మినార్, మార్చి 22 ప్రభాతవార్త : పాత కక్షలు కారణంగా ఫత్తె దర్వాజకు చెందిన ఖాజా పాషా,మహ్మద్ రియాజ్,మహ్మద్ ఓవైసీ ముగ్గురు వ్యక్తులు కలిసి 2021వ సంవత్సరం ఏప్రిల్ నెల ఇరవై ఏడవ తేదీన ఫత్తెదర్వాజ వద్ద ఉన్న కె.ఎం.హైదర్ ఇంటికి వెళ్లి అతని కుమారులను చేతులు,క్రికెట్ బ్యాట్లతో దాడి చేసి గాయ పరిచారు.అప్పటి ఎస్ఐ నర్సింగ రావు కేసుకు సంబంధింంచిన సాక్ష్యాలు సేకరించి చార్జ్ షీట్ దాఖలు చేశారు.నింధితులపై నేరం రుజువు కావటంతో చీఫ్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ డి.దుర్గాప్రసాద్ దాడి చేసిన ముగ్గురు నింధితులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ తెలిపారు.

## టిఫిన్ సెంటర్ వ్యాపారికి నాలుగు రోజులు జైలు,150 రూపాయలు జరిమానా

చార్మినార్, మార్చి 22 ప్రభాతవార్త : పాతబస్తీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్ణీత సమయం దాటిన తర్వాత వ్యాపారం చేస్తున్న టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి ప్రత్యేక మెట్రోపాలిటన్ కోర్టు న్యాయవాది నాలుగు రోజులు శిక్ష,150 జరిమానా విధించారని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.నరేష్ కుమార్ తెలిపారు.మహ్మద్ లాయక్ అహ్మద్ (40) అనే వ్యక్తి పంచమొహల్లాలో కెజిఎన్ టిఫిన్ సెంటర్‌ను సమయం దాటిన తర్వాత కూడ నడుపుతున్నాడు.అతనిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి టిఫిన్ సెంటర్ వ్యాపారి మహ్మద్ లాయక్ అహ్మద్ నాలుగు రోజులు జైలు శిక్షతో పాటు 150 రూపాయల జరిమాని విధించిందని సిఐ వెల్లడించారు. చట్ట వ్యతిరేకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ప్రముఖ తబలా విద్వాంసులు జ్ఞానేశ్వర్‌కు ఆత్మీయ సత్కారం

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: కథక్ కళాక్షేత్ర అధినేత పండిట్ అంజుబాబు, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ తబలా విద్వాంసులు తోట జ్ఞానేశ్వర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది.ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త, జవహర్‌బాలభవన్ పూర్వ సంచాలకులు డాక్టర్ ఎం.కె.రాము హాజరై జ్ఞానేశ్వర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధన మూర్తి, ప్రముఖ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, ప్రముఖ కవి, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి చెన్నయ్య,ప్రముఖ సంగీత దర్శకులు కలగా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. 50 సంవత్సరాల పాటు సుదీర్ఘ తబలా వాయిద్య విద్వాంసులుగా విశేషంగా సేవలందించిన వ్యక్తి తోట జ్ఞానేశ్వర్ అని ప్రశంసించారు.





సీనియర్ సిటీజన్స్‌తో కె.పి.విశాల్‌గౌడ్, భవానీ మాత ఊరేగింపులో మార్వాడీలతో సురేష్‌రెడ్డి, అభయాంజేయ స్వామి దేవాలయంలో బీఆర్ఎస్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి





నందమూరి నగర్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న జంపనప్రతాప్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, అరుణ్ యాదవ్ తదితరులు, కంటోన్మెంట్ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న మన్నె క్రిషాంక్ తదితరులు, రామాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న కాలేరు వెంకటేష్

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల మృతి

### దంపింగ్ యార్డు వద్ద ఒకరు..

బేగంపేట మార్చి 22, ప్రభాతవార్త : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నెక్లెస్‌రోడ్డు డంపింగ్ యార్డు వద్ద గుర్తించారు. ఈ ఘటన రా ంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ సంఘటనపై డంపింగ్ యార్డు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కె.సత్యనారాయణ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తించి రాంగోపాల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసుల కధనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నెక్లెస్‌రోడ్డు డంపింగ్ యార్డు వద్ద సుమారు 30 నుంచి 35సంవత్సరాలు వయస్సు కల్గిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడన్నారు.ఈ విషయాన్ని సెక్యూరిటీ గార్డు సత్యనారాయణ డయల్ 100కు కాల్ చేసి తెలియజేసాడన్నారు.మృతుడి వయస్సు 30నుంచి 35సంవత్సరాలు ఉంటుందని,నల్లచొక్కా, నీలి రంగు జీన్స్,ఎత్తు 5.8అడుగులు ఉన్నాడన్నారు. హిందువుగా ఉన్నాడన్నారు. సమీపంలో విచారించగా అతను బిచ్చగాడుగా తెల్సిందని,అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చన్నారు.మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికీ తరలించి బధ్రపర్చినట్లు, మృతుని ఆచూకి తెల్సిన వారు రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని అడ్మిన్ ఎస్సై రాజు రాథోడ్ తెలియజేసారు.

### అర్చన ప్లైవుడ్ ఎదురుగా మరొకరు

రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్చన ప్లై వుడ్ ముందు మినిస్టర్ రోడ్డు రాణిగంజ్ ముందు ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.వివరాలిలా ఉన్నాయి.ఈ నెల 21వతేదీన కానిస్టేబుల్ వై.బాలప్రసాద్ హోంగార్డు పరమేష్‌తో కల్సి పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నాడు.ఇదే సమయంలో అర్చన ప్లై వుడ్ ముందు మినిస్టర్ రోడ్డు రాణిగంజ్‌లో ఒక గుర్తు తెలియని పురుషుడు అపస్మారక స్థితిలో పడిఉన్నాడన్నారు.పరిక్షించగా అప్పటికే అతను మృతి చెందాడన్నారు.అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు.మృతుడు వయస్సు 30సంవత్సరాలు ఉంటుందని,ఎత్తు 5.6 అడుగులు,నలుపు రంగు లేతనీలం చొక్కా ,నలుపు ట్రాక్ ప్యాంటు కుడిచేతిపై ఒక టాటూ తెలుగులో పవన్ అని రాసి ఉందని,ఎడమచేతిపై మరో టాటూ తెలుగులో మహేష్, ఓంకారం, త్రిసూల్ చిహ్నం వేసుకుని ఉన్నాడన్నారు. మృతుని గుర్తించిన వారు రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని అడ్మిన్ ఎస్సై రాజు రాథోడ్ తెలియజేసారు.

# ఘనంగా ఉగాది శోభకృత్ నామ సంవత్సరం పండగ

### సీనియర్ సిటీజన్స్‌తో ఉగాది వేడుకలు నిర్వహించిన కె.పి.విశాల్‌గౌడ్

**పేట్‌బషీరాబాద్..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో బుధవారం యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.పి.విశాల్‌గౌడ్ ఉగాది వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.పి. విశాల్‌గౌడ్ సీనియర్ సిటీజన్స్‌కు ఉగాది పచ్చడిని పంపిణీ చేసి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అదే విధంగా శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ప్రజలందరికి శుభాలను చేకూర్చాలని భగవవంతుడిని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సభ్యులు,బలవంతరెడ్డి, లింగంగౌడ్, మల్లేషం, మురళిగౌడ్, నాగేష్, భిక్షపతిగౌడ్, నరహరిగైడ్, లక్ష్మణాచారి, సత్యనారాయణ, సత్తయ్య, పాండుచారి, ఉల్పీ సత్తయ్య, నర్సింగరావు, శ్రీరాములు, జి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### కొలన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాంగ పఠనం

**నిజాంపేట్..** శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకను పురస్కరించుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి బుధవారం నిజాంపేట్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొని రాశిఫలాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్,డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, వైస్‌చైర్మన్ రాజ్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, జర్నలిస్టు ముక్కర్ల లాలయ్య, బీఆర్ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఉగాది వేడుకలలో పాల్గొన్న సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల..** శ్రీ శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సుభాష్‌నగర్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని స్థానికులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మార్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన భవానీ మాతా ఊరేగింపులో సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం గంపల బస్తీలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని, నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఉగాది వేడుకల్లో పాల్గొన్న మర్రి, జంపన

**కంటోన్మెంట్..** ఉగాది పర్వదినం సందర్భంగా కంటోన్మెంట్ 6వ వార్డు నందమూరి నగర్ యువకులు నిర్వహించిన ఉగాది వేడుకలకు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోర్డు ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, బిఆర్ఎస్ నేతలు ప్రవీణ్ యాదవ్, ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడిని పలువురికి పంపిణీ చేశారు.

### ఉగాది వేడుకల్లో పాల్గొన్న మన్నె క్రిషాంక్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం కంటోన్మెం ట్ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకలకు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ పాల్గొని స్థానిక ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ వేడుకల్లో సహపంతి భోజనాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మురళీ, మోనీ, రఘు, సూరజ్, సాయి, త్రివేద్, రాము తదితరులు పాల్గొన్నారు.

### శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలి

**హైదరాబాద్..** శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకుని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కుటుంబ సభ్యులతోసహా బుధవారం ఓల్డ్ నల్లకుంట డివిజన్‌లోని రామాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీసీతారాముల వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శోభకృత్ నామ సంవత్సరంలో అందరికి మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



ఉగాది వేడుకల్లో పాల్గొన్న దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆనంద్ గుప్తా ,భక్తులు

### భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవి : కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి..** భారత దేశ సంస్కృతి సాంప్రదాయలు చాలా గొప్పవని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీని వాస్‌రెడ్డి అన్నారు.కాటేదన్‌లోని బిజెపి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన శ్రీ శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆయన స్వామి వారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురోగ్యాలతో చల్లగా ఉండాలని కోరారు.బిజెపి నాయకులు బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి,ఎల్‌వి.రెడ్డి,రమేష్ రెడ్డి,శివారెడ్డి,గణేష్,శివ, అవినాష్, చింటురెడ్డి పలువురు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు.

## చదువు పుస్తకాలకు మాత్రమే పరిమితం కాదు: బుద్ధ మురళీ

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: చదువు అంటే కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితం కాదని వివిధ రంగాలలో ఆసక్తి ఉన్నవారు ఆ రంగంలో ప్రతిభావంతులు కావటమే విద్య అర్థమని రాష్ట్ర సమాచార హక్కుచట్టం పూర్వ చీఫ్ కమిషనర్ బుద్ధమురళీ అన్నారు. సుధాకర్ అకాడమిక్ విద్యకన్నా నాట్యరంగంలో విశేష కృషి చేసి ఉన్నత స్థాయికిచేరుకున్నారని అభినందించారు. త్యాగరాయ గానసభలో కళాసుబ్బారావు కళావేదికలో తెలుగు విశ్వ విద్యాలయం నాట్య శాఖ ఆచార్యులు సుధాకర్‌కు 'గానసభ ఉగాది పురస్కారం' అందించి గౌరవించే కార్యక్రమానికి బుద్ధ మురళీ ముఖ్యఅతిథిగాహాజరై ప్రసంగించారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కళలు మానసిక శాంతికి ఒత్తిడి నుంచి దూరం అయ్యేందుకు దోహదం చేయటమే కాక కొన్ని రుగ్మతలు నివారణకు నాట్యం అభ్యసించటం మంచిదన్నారు. సుధాకర్ దేశంలోనే కాక విదేశాల్లో ఉన్నవారికి నాట్య శిక్షణ ఇస్తూ మన సంస్కృతిని ప్రచారం చేస్తున్నారన్నారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రావు, బిజెపి రాష్ట్ర నాయకుడు ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. సుధాకర్ మాట్లాడుతూ గానసభ పురస్కారం ఎంతో గొప్పదని, ఇందుకు కారణమైన పూర్వ అధ్యక్షుడు కళావేంకటదీక్షితులును గుర్తు చేసుకున్నారు. లక్ష్మీ వందన సమర్పణ చేశారు.

## ఆర్టీసి క్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో ఉగాది వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 22 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో ఉగది సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, పార్టీ యువనేత ముఠాజైసింహ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయం అర్చకులు జగన్మోహనాచార్యులు, కాశీనాథ్‌శర్మ, గోపాలాచార్యులు, రామాచారి, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, ఆలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్, నేతలు ఎర్రం శ్రీనివాస్‌గుప్త, అడిక్‌మెట్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలని పెదవేడు సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం పెదవేడు గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన పెదవేడు తాండలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తాండలో హనుమాన్ దేవాలయం లేన్నందున వారి చిరకాల కోరిక మేరకు హనుమాన్ దేవాలయం నిర్మిస్తున్నామన్నారు. దేవాలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు కిషన్‌నాయక్, గ్రామస్థులు నర్సింలుగౌడ్, రఘుపతిగౌడ్, అశోక్‌కుమార్, యాదయ్య, వెంకటయ్యనాయక్, దుస్తుర్‌నాయక్, నర్సింలునాయక్, రాజునాయక్, రాములునాయక్, గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి

షాబాద్, మార్చి 22, ప్రభాతవార్త : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థానానికి ఎదగాలని దామర్లపల్లి సర్పంచ్ బోకుల లింగం, ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్ అధికారి నారాయణలు తెలిపారు. బాబు జగ్జీవన్‌రాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నారాయణగూడ విద్యార్థులు బుధవారం షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. విద్యను మధ్యలో నిలిపివేయకుండా ఉండేందుకు డిగ్రీ కళాశాల 50మంది విద్యార్థులు ఈకార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను తెలుపుతూ ఉన్నత విద్యనభ్యసించాలన్నారు.

## ప్రజల కోసం ప్రశ్నిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రభుత్వం కుట్ర


ఓ.యూ ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట మాట్లాడుతున్న వెంకటేష్ చౌహాన్, వేల్పుల సంజయ్

తార్నాక, మార్చి 22 ప్రభాతవార్త: ప్రజల కోసం ప్రశ్నిస్తున్న బీఎస్పీ అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డీనేటర్ వెంకటేష్ చౌహాన్ ఆరోపించారు. బుధవారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌కు ఏమైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే భాద్యత వహించాలన్నారు. ఆయన ఏ కార్యక్రమాన్ని తలపెట్టినా ప్రభుత్వం అరెస్టులు చేసి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నాయకులను, జర్నలిస్టులను అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అన్నారు. జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రానికి ఐపీఎస్‌గా ఎన్నో సేవలందించిన ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్‌పై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఆయనకు ఏమైనా జరిగితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుండెల ధర్మేందర్, దయాకర్ మౌర్య, అబేందర్, అంబేద్కర్, యుగేందర్, పాష, అజీజ్, అర్షద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మానవ హక్కుల రక్షణకు ఐరా ముందు ఉంటుంది

**ఐరా జాతీయ అధ్యక్షులు డా. ఎం.యూ దువా**

మెట్టుగూడ, మార్చి 22 ప్రభాతవార్త: మానవ హక్కుల రక్షణ,సామాజిక సేవలో ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోషియేషన్ ఎంతో కృషి చేస్తుందని ఐరా జాతీయ అధ్యక్షులు డా. ఎం.యూ దువా పేర్కొన్నారు. మెట్టుగూడలోని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డా. దువా మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ఐరా దేశవ్యాప్తంగా సేవలందిస్తుందన్నారు. మానవ హక్కులు ఎక్కడ ఉల్లంఘనలు జరిగినా తమకు తెలిసిన వెంటనే వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఐరా జాతీయ అధ్యక్షులు జె. అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో సమస్యలను తమ సంస్థ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వానికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఖమ్మం పోడు భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. సమాజ హితం కోసం తాము పనిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐరా తెలంగాణ రాష్ట్ర చీఫ్ పద్మారెడ్డి, ఐరా చీఫ్ సెక్రటరీ లక్ష్మి, జాయింట్ సెక్రటరీ మణిమాల, రాంప్రసాద్, కార్యదర్శి వాణి ప్రదీప్, సోనియా ఠాగూర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక హృదయం సోషల్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆద్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

## టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న టిపిసిసి కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

**చార్మినార్..** శ్రీ శోభకృత నామ సంవత్సర ఉగాది సందర్భంగా గురువారం టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని పాతబస్తీకి చెందిన టిపిసిసి కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కలిసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పాతబస్తీలో వైభవంగా శ్రీ శోభ కృత సంవత్సర ఉగాది మహోత్సవాలు**

**చార్మినార్..** పాతబస్తీలోని పలు ప్రాంతాలలో శ్రీ శోభ కృత నామ సంవత్సర ఉగాది వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రజలు నూతనవస్త్రాలు ధరించి సమీపంలో ఉన్న దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఒకరికి ఒకరూ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. కాగా దూద్‌బౌలిలోని వాసవి భవనంలో గురువారం దూద్‌బౌలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మోకరాల లక్ష్మణ మూర్తి శర్మ సిద్దాంతి ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డి.ఆనంద్ గుప్తా, సంఘం ప్రతినిధులు, వాసవి భవనం ట్రస్ట్, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

**బాపూజీ నగర్‌లో ఉగాది పచ్చడిని అందజేసిన శ్రీగణేష్**

**కంటోన్మెంట్..** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం కంటోన్మెం ట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లో స్థానిక యువకులు నిర్వహిం చిన వేడుకలకు ఎస్.జి.ఎఫ్ చైర్మన్, బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీ గణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న వారందరికి శ్రీగణేష్ చేతుల మీదుగా ఉగాది పచ్చడి, పోలేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శరత్, అవినాశ్, కిరణ్, ప్రతాప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరంగా మారిన సిఎం రిలీఫ్ ఫండ్


మణికొండకు చెందిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి

నార్సింగి, మార్చి 22 ప్రభాతవార్త : నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందని మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మణికొండకు చెందిన రేవతికి రూ.32.వేలు, దీపికకు రూ.18,200ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద జబ్బులు వచ్చినప్పుడు పేదలు కార్పోరేట్ ఆసుపత్రికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారందరికి వైద్యం అందేలా సీఎం రిలీఫ్ ఫండ్ డబ్బులు వెంటనే విడుదల చేస్తూ ఆదుకుంటున్నారని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఏడాదికి ఒకరిద్దరికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేది కాదని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి నిధులు మంజూరు చేస్తు ఆదుకుంటున్నారని తెలిపారు. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం రిలీఫ్ ఫండ్ నిధిని కూడా సీఎం కేసీఆర్ రెట్టింపు చేశారని వివరించారు. పేదరికంలోని కష్టనష్టాలు తెలిసిన నేత సీఎం కావడం తెలంగాణ ప్రజల అదృష్టమని తెలిపారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, దేశంలోనే తెలంగాణను అన్ని రంగాలలో అగ్ర స్థానంలో నిలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాగరణ కోసం భూమి పూజ



అఫ్జల్‌గంజ్, మార్చి 22ప్రభాతవార్త: చైత్ర నవరాత్రుల సంప్రదాయంగా మా వైష్టవ దేవి విశాల్ జాగరణను ఈనెల 25న వైభవంగా నిర్వహిస్తున్నామని మా వైష్టవ జాగరణ్ మండల్ చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ తెలిపారు. బుధవారం గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో జాగరణ కోసం భూమి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జాతి శ్రేయస్సు కోసం, శాంతిని ప్రోత్సా హించడానికి, హిందు ధర్మపరిక్షణ కర్తవ్యంలో భాగంగా మాతా జాగరణను నిర్వహిస్తున్నామన్నారు. జమ్మూకాశ్మీర్ పూజారి లోకేష్‌పూజారి ఈ జాగరణ్‌కు వచ్చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై, ఐపిఎస్, ఐఎఎస్‌లతోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో కోర్ వర్కింగ్ కమిటి సభ్యులు రామ్‌కిషన్‌అగర్వాల్, రాకేష్ నర్సింగ్‌పూరియా, సంజయ్‌అగర్వాల్, అంజనీ సర్వయోగి, మనీష్‌అగర్వాల్, రాకేష్‌జలనీ, ధీరజ్‌అగర్వాల్, సూర్యకమల్‌గుప్త, లలిత్‌అగర్వాల్, హరిఓంగార్గ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ విద్యార్థుల మహా నిరసన దీక్షకు సంపూర్ణ మద్దతు: ప్రొ.గాలి వినోద్‌కుమార్


ప్రొ.గాలిని నిరుద్యోగ విద్యార్థుల మహా నిరసన దీక్షకు మద్దతు తెలుపాలని కోరుతున్న నాయకులు

తార్నాక, మార్చి 22 ప్రభాతవార్త: ఓ.యూలో ఈ నెల 24న జరుగనున్న నిరుద్యోగ విద్యార్థుల మహా నిరసన దీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రొ.గాలివినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఓ.యూలోని ప్రొ.గాలివినోద్‌కుమార్ కార్యాలయంలో తమ దీక్షకు మద్దతు తెలుపాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోట శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, బైరు నాగరాజు గౌడ్, సంజీవ్, మానవతారాయ్ తదితరులు కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ లీకేజీకి భాధులైన వారిపై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్ చైర్మన్‌ను ప్రభుత్వ రాజినామా చేయించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ విద్యార్థులకు న్యాయం జరిగేవరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోరాటం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు


చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరంలోపూజలు చేసిన జాతీయ బిజెపి ప్రధాన కార్యదర్శి ప్రకాష్, బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

గోషామహల్, మార్చి 22ప్రభాతవార్త: ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం చార్మినార్ వద్ద ఉన్న చారిత్రాత్మకమైన భాగ్యలక్ష్మి మందిరంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌జీ, ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో బిజెపినాయకులు అరవింద్, డి.గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనేదే కెసిఆర్ లక్ష్యం


ఉగాది వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు, జి.జి.వై.ఎఫ్ చైర్మన్ గద్దం శ్రీనివాస్‌యాదవ్

బేగంబజార్, మార్చి 22 ప్రభాతవార్త: ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలనేది తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అకాంక్ష అని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, గద్దం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గద్దం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉగాది పండుగ ను పురస్కరించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంచాగ శ్రవణం కార్యక్రమంలో గద్దం గంగాధర్‌ఫౌండేషన్ చైర్మన్ గద్దంశ్రీనివాస్‌యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ఆర్వీమహేందర్‌కుమార్ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయానికి రూ.4 లక్షల విరాళం

శంకర్‌పల్లి, మార్చి 22, ప్రభాతవార్త : శంకర్‌పల్లిలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి హుండీ లాకర్‌కు సుమారు రూ. 4లక్షలు విరాళాన్ని శంకర్‌పల్లికి చెందిన కాశెట్టి చంద్రమోహన్ అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులకు అందజేశారు. అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు సహకారం మరువలేనిదన్నారు. ఈకార్యక్రమంలో సాత ఆత్మ లింగం, సాత ప్రవీణ్‌కుమార్, జూలకంటి పాండురంగారెడ్డి, దండు మోహన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**శంకర్‌పల్లిలో ఘనంగా ఉగాది పండుగ**

శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండల ప్రజలు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా మహిళలు ఉదయాన్నే గృహాలను మామిడి కొమ్మలతో అలంకరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిష్టతో పచ్చడి తయారు చేసి బంధు మిత్రులకు పంచారు. గ్రామాల్లో ఆలయాల వద్ద పండితులు ఉగాది పంచాంగ శ్రావణాన్ని చదివి ప్రజలకు వినిపించారు.

## ఉగాది పర్వదినాన ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలి

**ప్రభుత్వ విప్ గాంధీ**


ఉగాది వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 22, ప్రభాతవార్త : నిజాంపేటలోని భాగ్యనగర్ కమ్మ సేవా సంఘాల సమన్వయ సమితి కార్యాలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలు ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని కార్పోరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఉగాది పర్వదినాన ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా షడ్రుచుల సమ్మేళనం సంబరాల సూర్యోదయం భవితల పంచాంగ శ్రవణం వసంత కోయిల గానంతోపాటు వచ్చేది తెలుగువారి పండగ ఉగాదిగా అభివర్ణించారు. ఈ నూతన తెలుగు సంవత్సరంలో మీ యొక్క జీవితం కొత్త ఆశలు, ఆశయాలు, ఆలోచనలతో నవ వసంతం ఆనందమయం కావాలని ఆశిస్తూ శేరిలింగంపల్లి నియోజకర్గ ప్రజానీకానికి, తెలుగు ప్రజలందరికీ శ్రీ శోభకృత్‌నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు చపరాల శ్రీనివాస్‌దాస్, గాంధీ, ప్రసాద్, నరసింహారావు, సుబ్బారావు, శ్రీనివాస్, కృష్ణరావు, తెరాస నాయకులు రంగరాయ ప్రసాద్, ఎర్రగుడ్డ శ్రీనివాస్‌యాదవ్, కోనేరు ప్రసాద్, సైదేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రామరాజ్య స్థాపన బిజెపితోనే సాధ్యం

**బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు**


ఉగాది వేడుకల్లో పాల్గొన్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 22, ప్రభాతవార్త : రామరాజ్య స్థాపన బిజెపితోనే సాధ్యమని త్వరలోనే దేశం మొత్తంలో బిజెపి రాజ్యం రాబోతుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి మధ్యప్రదేశ్ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధర్‌రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు టిటిడి బోర్డ్ అడ్వైజర్ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బిజెపి క్యాంపు కార్యాలయంలో బుధవారం మురళీధర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం యావత్తు బిజెపి వైపు చూస్తుందని త్వరలోనే బిజెపి ఆధ్వర్యంలో రామ రాజ్యం ఏర్పాటు కానుందని స్పష్టం చేశారు. తెలంగాణాలో కెసిఆర్ ప్రభుత్వం అవినీతి అక్రమాలతో ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. పేపర్ లీకేజ్‌లతో పాటు పలు స్కాముల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకరని అన్నారు. తెలంగాణాలో బిజెపికి అనుకూల పవనాలు వీస్తున్నాయని వచ్చే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బిజెపి క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమని, బిజెపి నాయకులు కార్యకర్తలు కష్టపడి కూకట్‌పల్లిలో బిజపి విజయానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. అనంతరం రాజేశ్వరరావు క్యాపు కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన బిజెపి నేతలకు కార్యకర్తలకు అభిమానులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు, మూసాపేట కార్పోరేటర్ మహేందర్, బిజెపి రాష్ట్ర నాయకులు నాయినేని సూర్యప్రకాశ్‌రావు, అద్వానీ సూర్యరావు, ఎంజాల పద్మయ్య, జి.శ్రీకర్‌రావు, బిజెపి నాయకులు వినోద్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, సాదుప్రతాప్‌రెడ్డి, రఘురాం పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడి పంపిణీ


ఉగాదిపచ్చడి పంపిణి చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు నందకిషోర్‌వ్యాస్

బేగంబజార్, మార్చి 22ప్రభాతవార్త: ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, అధిత్య చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్) పాల్గొన్నారు. ఈసందర్భంగా శోభకృత్ ఉగాది పండుగ పర్వదినాన్ని అందరు కలిసి కట్టుగా జరుపుకోవడం సంతోష దాయకన్నారు. మహిళలు తయారు చేసిన పంచడిన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ పరమేశ్వరిసింగ్, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శైలేందర్, అనిత పాల్గొన్నారు.

## షడ్రుచులు తెలిపే ఉగాది పచ్చడి

శామీర్‌పేట, మార్చి 22, ప్రభాతవార్త : శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగను బుధవారం భక్తి శ్రద్దలతో సాంప్రదాయబద్దంగ ఘనంగ జరుపుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఇళ్ల ద్వారాల వద్ద పచ్చటి మామిడి ఆకులు తోరణాలు, వేపకొమ్మలను ద్వారం వద్ద గుమ్మాలకు కట్టి ఉగాది పండుగను ఘనంగ జరుపుకున్నారు. ప్రతి ఇంటిలో ఉగాది పండుగ సందర్భంగ శోభ కనిపించింది. జీవితంలో షడ్రుచులను తెలిపే ఉగాది పచ్చడిని తయారు చేసి పూజించి ప్రజలు తీర్థరసంగ పచ్చడిని తీసుకున్నారు. ఉగాది పండుగ పర్వదినం సందర్భంగ తెలుగు నూతన శ్రీ శోభకృత్ నామ సంవత్సరంను పురస్కరించుకుని శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో, అదే విధంగ తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో వేదపండితులు శ్రీ శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సరం పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఏడాదిలో జరిగే భవిషత్ కార్యక్రమాలను పంచాంగ శ్రవణం ద్వారా వివరించారు. వర్షాలు, పంటలు, రుతువులు, రాజయోగ రాజు, మంత్రి పరిపాలన గురించి, గ్రహాల తీరు పలు వాటి గురించి బ్రాహ్మణ, వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రజలకు సంబంధించి వివిధ రాశుల వారికి ఈ ఏడాదిలో ఆదాయం, వ్యయం, పలు పూజా కార్యక్రమాల గురించి వివరించారు.

## నేటి నుంచి హిట్‌వికేట్ క్రికెట్ ఛాంపియన్‌షిప్

హైదరాబాద్, మార్చి 22, ప్రభాతవార్త: హైదరాబాద్‌కు చెందిన క్రికెట్ స్ట్రాటజీ గేమింగ్ యాప్ "హిట్‌వికేట్ "ఈనెల 23నుంచి "హిట్‌వికేట్ క్రికెట్ వరల్డ్ ఛాంపియన్‌షిప్" నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. మెబైల్‌గేమింగ్ చరిత్రలో అతిపెద్ద స్ట్రాటజీ బేస్ట్ ఈస్పోర్ట్ టోర్నిగా దీన్ని పేర్కొంది. ఏప్రిల్ 16వరకు జరిగే ఈవర్చువల్ టోర్నిలో ఇండియాతోపాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, యూఏఈ, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి 30జట్లు బరిలో నిలిచాయని నిర్వాహకుకు హిట్‌వికెట్ నిర్వాహకులు కశ్యప్‌రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షుడిగా దండుగుల వెంకటేష్


బండి సంజయ్‌తో దండుగుల వెంకటేష్

అల్వాల్, మార్చి 22 ప్రభాతవార్త: రాష్ట్ర ఓబిసి మోర్చా ఉపాధ్యక్షుడిగా దండుగుల వెంకటేష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆయనకు నియామక పత్రాన్ని అందించడం జరిగింది. ఓబిసిల అభ్యున్నతికి నిరంతరం శ్రమించాలని ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటేష్‌ను కోరారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో బండి సంజయ్ నాయకత్వం పట్ల ఓబిసి ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని దండుగుల పేర్కొన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మల్లిఖార్జున్ యాదవ్ మాచర్ల శ్రీనివాస్ పర్వతాలు పాల్గొన్నారు.

## భవనంపై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



పేట్‌బషీరాబాద్, మార్చి22 ప్రభాతవార్త: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మధ్యప్రదేశ్‌కు చెందిన శుభం(26) అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం భార్య సీమ, ఇద్దరు పిల్లలతో నగరానికి వలస వచ్చి జీడిమెట్ల పైపులైన్ రోడ్డులోని ఎస్‌వీసి కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేస్త్రిగా పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. అయితే ఈనెల 20న నిర్మాణంలో ఉన్న భవనం మూ డవ అంతస్తులో పని చేసుకుంటూ శుభం ప్రమాదవశాత్తు కిందపడడంతో ఇనుపరాడ్డు తలలో గుచుకొని తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే గమనించిన తోటి కార్మికులు సమీపంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. శుభం రెండు రోజుల పాటు చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. అయితే ఎస్‌వీసీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం కార్మికుల విషయంలో సరిమైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో తన భర్త శుభం మృతిచెందాడని భార్య సీమ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మసీద్‌ను ప్రారంభించిన హోంమంత్రి

శంకర్‌పల్లి, మార్చి 22, ప్రభాతవార్త : మైనార్టీలు కలిసికట్టుగా ఉండి అభివృద్ధి చెందాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ అలీ పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీవీఆర్ ఫంక్షన్‌హాల్ దగ్గర నూతనంగా నిర్మించిన మసీదును, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించి ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అన్ని మతాలకు సమన్వయం కల్పిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఈకార్యక్రమంలో మసీద్ నిర్వహకులు గౌస్, రహమత్‌ఖాన్, జాకీర్, జాఫర్, సలీం పాషా, ముంతాజ్, సర్తాజ్, బీఆర్ఎస్ నాయకులు పాపారావు, ఉన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, RATHOD ANJU GULAB, R/o.10-3-311/7/A Castle Hills, Vijaya Nagar Cly Hyd, T.S, Changed My Name As ANJALI VILAS JADHAV W/o.VILAS SHIVDAS JADHAV.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

IN THE COURT OF THE XVII SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 1355 OF 2017

BETWEEN:
M/s. TATA AIA LIFE INSURANCE COMPANY LTD formerly known as M/s. TATA AIG LIFE INSURANCE COMPANY LTD., 6th Floor, Peninsula Towers, Peninsula Corporate Park, Ganapatrao Kadam Marg, Lower Parel(W), Mumbai-400013, Maharashtra. Rep by its Manager – Legal. ...Plaintiff

AND
• B. Susheela, W/o B.Chenna Reddy. aged about 81 years;
• B.Mahender Reddy S/o B.Chenna Reddy, aged about 61 years;
• B.Rajender Reddy. S/o B.Chenna Reddy, aged about 58 years;
• B.Mahaveer Reddy S/o B.Chenna Reddy, aged about 55 years
• B.Dhananjay Reddy, S/o B.Chenna Reddy, aged about 50 years
Defendants 1 to 5 residents at 3-6-208 Street No.15 Himayathnagar, Hyderabad-500025
• Srinivas Tirumala Kanduri, S/o late Sri Tandava Krishna, aged about 47 years, residing at Gand River VE APT 104, Farmington Hills, MI 48335. ...Defendant/s

To,
• B.Susheela, W/o B.Chenna Reddy, aged about 81 years;
• B.Rajender S/o B.Chenna Reddy, aged about 58 years;
Both residents of 3-6-208 Street No.15 Himayathnagar, Hyderabad-500025.

Take notice that M/s. TATA AIA LIFE INSURANCE COMPANY LTD, 6th Floor, Peninsula Towers, Peninsula Corporate Park, Ganapatrao Kadam Marg, Lower Parel(W), Mumbai-400013, Maharashtra has instituted the above said suit in O.S. No. 1355 of 2017 before The Hon'ble XVII Senior Civil Judge City Civil Court at Hyderabad against you. The Hon'ble Court posted the lis to 31.03.2023 and directed issuance of notice to you by publication of the same in the newspaper. Hence, you all are hereby called upon to appear in person or through a duly instructed Advocate before the court on the said Thirty First day of March, 2023 at 10.30 hours or whenever the lis is taken up for hearing to represent your case, if any. Lest the case would be heard and decided in your absence.

"By Order"
CHAVALIRAMANAND
Advocate
17-1-388/44 Rd.14 Sri Lakshminagar-1, Saidabad, Hyderabad-500059. Ph. 9440054416

PUBLIC NOTICE

That my client ARATI SRIKANTH, S/o.Arati Komaraiah, Occ: Busi ness, aged 24 years, R/o.H.No.1-52, Sanghiguda Village, Shamsha bad Mandal, R.R.District, TS. 501218, have lost his link Original Regd Sale Deed document bearing No. 2306 of 1980, dated 29-02-1980, registered before SRO-Malakpet, Hyderabad East in respect of piece and parcel of the open land bearing plot No.46, admeasuring 300 Square Yards, or its equivalent to 259 Square Meters, in Survey No.96, 97 and 103, Situated at KUNTLOOR Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District under Pedda Amberpet Municipality, under registration Sub-District Hayathnagar, the above document executed by Pininti Lasma Reddy, Pininti Sai Reddy, Pininti Lachi Reddy all are S/o.P.Venkat Reddy, all the vendors through his GPA holder M.V.Ranga Chari, S/o.Appala Chari, infavour of Gidugu Venkata Ramana S/o. G.Prasad Rao, who in turn purchased the said property by Arati Srikanth who lost his above said document, while shifting the house on dt:16-01-2023. If anybody found that document may misuse it therefore, the general Public are hereby informed not to deal with the said property with any person or persons. In spite of this notice if anybody enters any transaction my Clients are not responsible for the same.

RAMINI SAIDHI REDDY
ADVOCATE
#6-45, ROAD NO.4, BHAVANI NAGAR, DILSUKHNAGAR, HYDERABAD, T.S.60. PH: 9948228066.

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2) 1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500001

OA. 370 of 2022
BANK OF INDIA, Khairatabad Branch ...Applicant
VS
Sri Raja Rajeshwara Swamy LCCS Ltd and another ...Defendants
To,
1. Sri Raja Rajeshwara Swamy LCCS Ltd Rep by Yellaiah Allakuntla, 13-6-251/5/65, Tulja Bhavani Nagar, Karwan, Hyderabad -500028, Telangana.

SUMMONS/substituted Service by way of Publication

WHEREAS,OA/ 370 /2022 was listed before Hon'ble Presiding Officer/Registrar on 10 /06 /2022
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.31,47,187.38 ps(application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on 19.04.2023at 10:30A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 09/03/2023.

(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 2) 1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500001

OA. 369 of 2022
BANK OF INDIA, Khairatabad Branch ...Applicant
VS
M/s GVB Enterprises and others ...Defendants
To,
1. M/s GVB Enterprises, H.No.2-104, P No.204, Saimithra Apartments, Vani Nagar, Vasanthapuri Malkajgiri, Hyderabad- 500047, Telangana.
2 . Mrs Veerani Krishnaveni W/o Veeranki Kranthi kumar, H No.2-104, Flat No.204, Saimithra Apartments, Street No.2, Vani Nagar, Malkajgiri, Hyderabad-500047
3. Mr Boddu Gangadhar S/o BodduAppanna H No.8-3-237/A/3, LN nagar, Near Ganapathi Complex, Yousufguda, Hyderabad- 500045
4 . Mr Veerani Kranthi Kuamar S/o Veeranki Satyanarayana, H No.2-104, Flat No.204, Saimithra Apartments, Street No.2, Vani Nagar, Malkajgiri, Hyderabad-50004

SUMMONS/substituted Service by way of Publication

WHEREAS, OA/ 369 /2022 was listed before Hon'ble Presiding Officer/Registrar on 10/06/2022.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.95,69,734.84 ps (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Registrar on 25/04/2023 at 10:30A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 09/03/2023.

(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons

## రంగారెడ్డి జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు: మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి: చిత్రంలో ఎల్.రమణ, మంచిరెడ్డి, వాణిదేవి తదితరులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారానికి రంగారెడ్డి జిల్లాలో అన్ని స్థాయిల్లో ఆతీ మ్రయ సమావేశాలను నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితాఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లె లగూడ ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్ మంత్రి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీని మరింత పటిష్టతం చేయడానికి ఆత్మీయ సమ్మేళనాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ముఖ్యంగా బిఆర్‌ఎస్ పాలనను చూసి జీర్ణించుకోలేని విపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో జిల్లా బిఆర్‌ఎస్ ఇంఛార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఇబ్రహీంపట ్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, ఎల్‌బినగర్ ఎమ్మెల్యే మూసీ రివర్ బోర్డు ఛైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, సురభి వాణిదేవి, కసిరెడ్డి నారాయణరెడ్డి, బొగ్గారపు దయానంద్, రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు ఆయాచితం శ్రీధర్, ఉప్పల శ్రీనివాస్‌గుప్త, అమరవాది లక్ష్మీనారాయణ, సత్తు వెంకటరమణారెడ్డి, డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లు మనోహర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు పనులు ప్రారంభం



మల్లాపూర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పోరేటర్ పన్నాల

**తార్నాక, మార్చి 22ప్రభాతవార్త:** మల్లాపూర్‌చౌరస్తా ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం పనులను బుధవారం ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చూస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల కిరన్ కుమార్ రెడ్డి, సిహెచ్. మల్లేష్, ఎస్.వి.శ్రీనివాస్, బెల్లం గట్టయ్య, గడ్డం రవి, గరికె సుధాకర్, శ్రీరాంసత్యనారాయణ, శీతల విజయ్, సీతత వీరస్వామి, పర్వతాలు, వెంకటేశ్వర్ రెడ్డి, దుర్గయ్య, దొడ్డి మల్లేష్, శ్రీశైలం, కుందన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర సాయం



లబ్దిదారులకు చెక్కును అందజేస్తున్న సత్తయ్య తదితరులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** రాష్ట్రంలో భారాస సర్కార్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని, సీఎం సహాయనిధి పథకం నిరుపేదల పాలిట వరంగా మారిందని డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 10వ వార్డుకు చెందిన గంధం శమంతకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.60వేలను మాజీ సర్పంచ్ చెవుల దశరథ ఆధ్వర్యంలో సత్తయ్య అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ సీఎం రిలీఫ్‌ఫండ్‌ద్వారా నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు లబ్ది పొంది నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లగుర్రం విజయానంద్ రెడ్డి, గుండా ధనరాజ్, కొంతం యాదిరెడ్డి, చెక్క బాల నర్సింహ, కొమ్మని దయానంద్, చెక్క రఘు, మేతరి శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హరిహర క్షేత్రంలో ఉగాది వేడుకలు



హరిహరక్షేత్రంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

**హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహరక్షేత్రంలో ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం ఆలయంలో ప్రధానర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖర్‌శర్మ తదితరులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సూగూరు రమేష్, ఇఓ జోషి మార్తాండరావు, సభ్యులు రొడ్డ రమేష్, సరాపు శ్రీహరి, శెట్టి విజయ్‌కుఆర్, వనం సత్యేందర్, పారిజాతారెడ్డి, రేణుఅగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగల ప్రాశస్త్యాన్ని విధ్యార్థులకు తెలియజేయాలి



ఉగాది వేడుకల్లో పాల్గొన్న విధ్యార్థినులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** పండుగల ప్రాశస్త్యాన్ని విధ్యార్థులకు చిన్ననాటి నుంచే వివరించాలని ప్రముఖ విద్యావేత్త కేంబ్రిడ్జి విద్యాసంస్థల అధిపతి కె.శంతన్ కుమార్ అన్నారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి ఉన్నత పాఠశాలలో ఉగాది వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పండుగ విశిష్టత తెలిపేల మామిడి ఆకులు, మామిడికాయలు, వేప పువ్వు, దేవతా మూర్తుల చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శంతన్ కుమార్ మాట్లాడుతూ షడ్రుచులు కలిసిన ఉగాది పచ్చడి తెలుగు వారికి ఎంతో ప్రత్యేకమని అన్నారు. అనంతరం విధ్యార్థులు, ఉపాధ్యాయులబృందం ఉగాదిపచ్చడి తయారుచేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఝాని ్స తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల దుస్థితిపై యువజన కాంగ్రెస్ నాయకుల ఆందోళన



అధ్వాన్న రహదారులపై ఆందోళన చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ ఐదవ డివిజన్‌లోని రోడ్ల దుస్థితిపై యువజన కాంగ్రెస్ ఆందోళన నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధ్వాన్న రోడ్లపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లు దారుణంగా ఉన్నాయనీ గుంతలమయంగా మారిన రహదారుల వల్ల ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఏప్రిల్ 15తేదీలోపు రోడ్లను బాగు చేయాలనీ లేనిపక్షంలో ప్రజలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, వినోద్‌నాయక్, గుర్రం రాఘవేందర్, సురేందర్‌రెడ్డి, యూసుఫ్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, పవన్‌రెడ్డి, బాలునాయక్ తదతరులు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో పంచాంగ శ్రవణం



ఉగాది పంచాంగ పఠనం చేస్తున్న నర్సింహ శాస్త్రి

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలో ఉగాది పర్వదినం సందర్భంగా శోభకృత్ నామ సంవత్సరం పంచాంగ పఠన కార్యక్రమం జరిగింది. స్థానిన నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గాయత్రీ సేవా సంఘం సహకారంతో బ్రహ్మశ్రీ దేవరకొండ నరసింహశాస్త్రి పంచాంగ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, కాలనీ కమిటీ ప్రతినిధులు, స్థానిక శివసాయినగర్, టిఎస్ఆర్ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా తుల్జా భవానీ ఆలయ వార్షికోత్సవం

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని జల్‌పల్లి శ్రీరామకాలనీలో జై సాయి తుల్జా భవాని మాత మందిరం 11వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువ నాయకుడు, ఇంద్రారెడ్డి ట్రస్ట్ ఛైర్మన్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి తుల్జా భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ నిర్మాహకులు సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే బేతి

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభు త్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్ వార్డు కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కేంద్రం ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు, వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా.భావన, సూపర్‌వైజర్ బోగ ప్రకాష్, బిఆర్‌ఎస్ నేతలు వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గరిక సుధాకర్, నరోత్తమ్‌రెడ్డి, జెసిబి రాజు,సూరం శంకర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశంకు స్పందన : అశోక్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ హయాంలోనే అభివృద్ధి సాధించిందని పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్‌లో టిడిపి నేత కె.గిరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలోనే ఉప్పల్‌లో మున్సిపల్ స్టేడియం, వెలుగుగుట్ట రిజర్వాయర్, వెంకట్‌రెడ్డి నగర్ బస్టాప్, క్రికెట్ స్టేడియం, మున్సిపల్ ఆఫీసు తదితర నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి ప్రజలలో మంచి ఆదరణ ఉందని, పార్టీ కోసం ఎంతో మంది పనిచేస్తున్నారని తెలిపారు. పార్టీని కింది స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈస ందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి టిడిపి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు సర్వ సత్తయ్య యాదవ్, డాన్ బిక్షపతి, ఆదినారాయణగౌడ్, మెహబూబ్, రమేష్, బుర్ర నరసింహ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం : ఎమ్మెల్యే



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీనగర్‌కు చెందిన గ్రేసి(16) అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఎమ్మెల్యేను సంప్రదించడంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50లక్షలు మంజూరు చేయించి బుధవారం ఆమె తండ్రి అరుణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంతుల రాజారెడ్డి, శ్రీధర్ గౌడ్, మేరి, జాకబ్, దయనంద్, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

## బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు



ఉప్పల్‌లో చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, సుక్క కిరణ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోపడుతాయని బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, సుక్క కిరణ్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ బస్టాండ్ వద్ద బిఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. బిఎల్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచిత వైద్య శిబిరాలు, అర్హులైన పేదలకు ఉచితంగా శిక్షణ, అర్థికంగా చేయూత అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ మంజుల, బిఆర్ఎస్‌నాయకులు బాషపల్లి నిరంజన్‌చారి, అల్వాల్ నాగరాజు, గజ్జెల సత్యరాజ్‌గౌడ్, మస్తాన్, బాబురావు, నవీన్‌గౌడ్, కాయల చందు, సిద్దయ్య, మధు, నవీన్‌చారి, ఆటో యూనియన్ నాయకులు ఆషు, జగన్, ఉప్పల్ డిపో జెబిఎస్‌నాయుడు, బాలరాజు, స్వామి, రాంగోపాల్, రేణుక, కవిత పలువురు బిఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి : పవన్



దానకిషోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త :** డివిజన్‌లోని పలు కాలనీలలో డ్రైనేజీనీరు కలిసి మంచినీరు పూర్తిగా దుర్గన్నంగా మారుతున్నాయని వెంటనే చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జలమండలి ఎండి దానకిషోర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. డివిజన్లో దశాబ్దాల క్రితంనాటి డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తిగా పాడయ్యాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పురాతన పైపులు పగిలి మంచినీరు పూర్తిగా కలుషితం అవుతుండడంతో కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రోడ్లు బాగు చేయండి...** డివిజన్ పరిధిలోని గుంతలమయంగా మారిన రోడ్లను వెంటనే బాగు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు విజ్ఞప్తి చేశారు. పలు కాలనీలకు సంబంధించి నిధులు మంజూరయ్యాయని పనులు ప్రారంభం కావడంలేదని వెంటనే పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

## బిజెపి నాయకుల ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వెంకటేష్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు పరిధిలోని ప్రగతి నగర్ కాలనీ నివాసి నారెడ్డి మధుసూదన్‌రెడ్డి వృత్తి రీత్యా డ్రైవర్ నెల రోజుల కింద డ్యూటీ మీద కర్ణాటక రాష్ట్రానికి వెళ్లాడు. ప్రమాదవశత్తు లారీలోని ఐరన్‌పైపులు అతని మీద పడటంతో అక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఇంటి పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కమ్మగూడ బిజెపి సీనియర్ నాయకులు అనుపటి వెంకటేష్ యాదవ్ తక్షణ ఆర్థిక సాయం కింద 10వేల రూపాయలను అతని భార్య హేమలతకు తన బృందంతో కలసి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు తుళ్ల నరసింహగౌడ్, నాయకులు బచ్చిగళ్ళ రమేష్, నాయని సంజీవరెడ్డి, వద్దగోని అజయ్ గౌడ్, అనుపటి శ్రీశైలం యాదవ్, బైరం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారి సమస్యను పరిష్కరించిన డిప్యూటీ మేయర్



డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న చిరువ్యాపారి

**తార్నాక, మార్చి 22 ప్రభాత వార్త:** ఫుట్ పాత్‌పై చిరు వ్యాపారంచేస్తున్న ఓ వికలాంగుడి సమస్యపై నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించారు. అబిడ్స్‌లోని జీపీఓ సమీపంలో ఫుట్‌పాత్‌పై గత కొన్నేళ్లుగా వీధి వ్యాపారం చేస్తున్న ముజీబ్‌ఖాన్ షాపుకు జీహెచ్ఎంసీ వారు రేలింగ్ ఏర్పాటు చేశారు. దీంతో అతను తిరిగి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. దీంతో ముజీబ్ ఖాన్ డిప్యూటీ మేయర్‌ను కలిసి తన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆమె వెంటనే జెడ్‌సీకి ఫోన్ ద్వార సం ప్రదించి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. దీంతో వికలాంగుడైన ముజీబ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేశాడు.

## నూతన వెలుగులు నిండాలి : మంత్రి



పంచాంగం ఆవిష్కరిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త :** తెలుగు నూతన సంవత్సరంలో అందరిజీవితాలలో నూతన వెలుగులు నిండాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాడిచర్ల నాగేశ్వరసిద్ధాంతి రూపొందించిన శోభోకృత ఉగాది తెలుగు నూతన సంవత్సరం పంచాంగం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉగాది పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, వర్కింగ్‌ప్రెసిడెంట్ జిగిని రామమూర్తి ఈనెల 30వ తేదీన కాలనీలో జరిగే శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మహిళా సంక్షేమానికి కృషి : బలాల



ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట డివిజన్‌లోని పద్మనగర్‌లో ఏర్పాటు చేసిన సాలర్ ఎ మిల్లత్ కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయంఉపాధి అవకాశాలు కల్పించడానికి ఇటువంటి శిక్షణా కేంద్రాలు దోహదపడతాయని, ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవానిఇ సూచించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార ్యక్రమంలో నాయకులు సైపుద్దీన్ షఫీ, నజియా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఉగాది వేడుకలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్ డివిజన్ శ్రీ సాయినగర్‌లో సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఉగాది పండుగను వైభవంగా నిర్వహించారు. కాలనీలోని అభయాంజనేయస్వామి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్షేమ సంఘం సభ్యులు ఉగాది పచ్చడిని తయారు చేసి భక్తులకు ఎలాంటి అందజేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం చేసారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం సలహాదారులు రంపె చంద్రమౌళి, ఇరగదిండ్ల ఇస్తారి, మేకల చెట్టప్ప, అధ్యక్షులు మద్దెల వెంకన్నగౌడ్, కోశాధికారి తాటి సుభాష్ గుప్తా, ఉపాధ్యక్షులు గ్యారల రమేష్, రొయ్యల క్రిష్ణ, సహాయ కార్యదర్శులు వెంకటేష్ శ్యామల, మెతుకు ధన్‌రాజ్, ప్రచార కార్యదర్శులు రొయ్యల మహేష్, సోమేష్, వంగరి శ్రీనివాస్, పాము ప్రభాకర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ ఆవిష్కరణ, శ్రవణం



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ గాయత్రి భవన్‌లో బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పంచాంగ ఆవిష్కరణ, పంచాంగ శ్రవణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగాడివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, విద్యా ప్రవీణ డా. కుప్పా శ్రీనివాసశాస్త్రి విచ్చేసారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌రావు,గౌరవాధ్యక్షులు మంగపతిరావు, లక్ష్మీనారాయణ, కురుమారావు, సాంబశివరావు, విజయపురి పిడబ్ల్యూడి శర్మ, నాయకులు నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఘనంగా ఉగాది వేడుకలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో ఉగాది సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పా రామంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ జ్యోతిషులు సోమనాథశాస్త్రి ఆధ్వర్యంలో పంచాంగశ్రవణం చేశారు. ద్వాదశి రాశుల ఆదాయ, వ్యయాలు, వారికి ఈ సంవత్సరంలో జరిగే విషయాలను క్లుప్తంగా వివరించారు. వాటి పరిష్కార్కాలను విపులంగా పంచాంగ శ్రవణలో వివరించారు. అనంతరం రేణుక ప్రభాకర్ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పాట, దశావతారాలు, అన్నమయ్య కీర్తనలు, హనుమాన్ చాలీసా, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. ఉగాది సందర్భంగా సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## పండుగలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** పండుగలు సాంప్రదాయాలకు ప్రతిరూపాలుగా నిలుస్తాయని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సలీంగనర్‌లోని గణేష్ దేవాలయంలో జరిగిన ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఉత్సవాలను శాంతి యుతవాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, కొప్పుల దినేష్, బొక్క మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భరత్‌నగర్‌లో అధ్వాన్నంగా డ్రైనేజీ



ఓపెన్ డ్రైన్‌లో నిండి పోయిన మురుగునీరు

**హైదరాబాద్, మార్చి 22 ప్రభాతవార్త :** ఉప్పల్ భరత్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొరిగె కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప్పల్ భరత్‌నగర్‌లో టిఐఎస్ ఆసుపత్రి రహదారిలో ఓపెన్ డ్రైన్ నిండిపోయిందని, డ్రైనేజీ లైన్లు ఓపెన్ డ్రైన్‌లో కలిసి దుర్వాసనలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది నుంచి ఓపెన్ డ్రైన్‌లు శుభ్రం చేయడం లేదని, పూడికతీత పేరుతో అధికారులు హంగామా చేయడం తప్పా నాలాలు శుభ్రం చేయడం లేదన్నారు. ఇళ్లలో నుంచి మురుగునీరు బయటికి వెళ్లడంలేదని, దీంతో ఇళ్లలో ఉండలేక ఇబ్బంది పడుతున్నార న్నారు. దీనిపై మున్సిపల్, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో సమస్యలు వస్తున్నాయని, సమస్య పరిష్కరించకపోతే బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

## అభివృద్ధి వేగవంతం చేయండి : కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మార్చి 22 ప్రభాతవార్త :** డివిజన్లో పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రశాంతిలతో డివిజన్లో ఉన్న పలు సమస్యల గురించి కార్పొరేటర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులుకలగకుండా అవసరమైన పెండింగ్ పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆకుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

## మిని ఎయిర్‌టెక్ వాహనాన్ని కేటాయించాలి: కార్పొరేటర్ అరుణ



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

**హైదరాబాద్, మార్చి 21 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌కు ప్రత్యేకంగా మిని ఎయిర్‌టెక్ వాహనాన్ని కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి వాటర్ వర్క్స్ జిఎంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సైదాబాద్ డివిజన్‌కు ప్రత్యేకంగా మిని ఎయిర్‌టెక్ వాహనం లేకపోవడం వల్ల డ్రైనేజీ క్లీనింగ్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకాపు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.